సాక్షి
జగిత్యాల
శుక్రవారం ၊ 25 ၊ జూలై ၊ 2025



స్వల్పంగా పెరిగిన గోదావరి

ధర్మపురి: ఎగువన కురుస్తున్న వర్షాలు, కడెం ప్రాజెక్టు నుంచి వచ్చే నీటితో ధర్మపురి వద్ద గోదావరి స్వల్పంగా పెరిగింది. పశువులకాపరులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రాం నర్సింహారెడ్డి కోరారు.



సాఫల్యం.. వైఫల్యం!

వివాహమైన ప్రతీ స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది. ఆ యోగ్యత కొందరికి లభించడం లేదు. కొన్ని అనారోగ్య కారణాలు, లేదా భర్తలో ఏదైనా లోపమైనా ఉండొచ్చు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల భారీ నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

ప్రమాద బాధితులకు పరిహారం అందేలా చర్యలు

సాక్షి స్పందన

కోరుట్ల: కోరుట్లలో గతనెల 15న గణపతి విగ్రహం తరలిస్తుండగా జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. ఆరుగురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితిపై 'సాక్షి' 'పాపం దయనీయం' శీర్షికన ఈనెల 24న కథనం ప్రచురించింది. ఈ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు అందించామని, చికిత్స పొందుతున్న బాధితులకు వైద్యం వివరాలు సేకరిస్తున్నామని, ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. సంస్థ నిబంధనల ప్రకారం సివిల్ సర్జన్ ర్యాంక్ అధికారి ఇచ్చే డిజెబిలిటీ సర్టిఫికెట్ ఆధారంగా పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ సుదర్శనం

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, ధర్మపురి సబ్ డివిజన్ల విద్యుత్ సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని తెలిస్తే చర్యలు ఉంటాయన్నారు. భద్రత చర్యలు తీసుకోకుండా విధులు నిర్వర్తిస్తే రూ.3వేల జరిమానా విధిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. టెక్నికల్ సెఫ్టీ ఆఫీసర్ గంగారాం, జగిత్యాల డీఈ రాజిరెడ్డి, ఏడీఈలు, ఏఈలు, ఏఏఓలు, సబ్ ఇంజినీర్లు, ఓఅండ్ఎం ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా షర్మిల

జగిత్యాల: మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా షర్మిల నియమితులయ్యారు. సూపరింటెండెంట్ ఎంజీ.మూర్తి, షర్మిల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్ఎంవోలు విజయ్‌రెడ్డి, సుమన్‌మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధీర్ ఉన్నారు.

ఆంక్షలు లేకుండా రైతులకు రుణాలివ్వండి

జగిత్యాలటౌన్: బ్యాంకుల ద్వారా రైతులకు ఆంక్షలు లేకుండా రుణాలు ఇచ్చేలా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు మాజీమంత్రి జీవన్‌రెడ్డి లేఖ రాశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు తాకట్టు పెట్టుకోకుండా రుణాలివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలను బ్యాంకులు పాటించడం లేదని, పాస్ బుక్కులు కలిగిన అసైన్డ్ భూముల రైతులకూ రుణాలు ఇచ్చేలా చూడాలని కోరారు.

పాఠశాలల్లో గ్రంథాలయాలు

- అందుబాటులో బాలసాహిత్య పుస్తకాలు
- ప్రత్యేక పీరియడ్ నిర్వహణకు నిర్ణయం
- మొబైల్ ఫోబియాను తగ్గించడానికే..



జగిత్యాల: నేటి హైటెక్ యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడుతున్నారు. పుస్తక పఠనం అనేది మరిచిపోతున్నారు. ఫలితంగా విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. అలాగే చదువులో నష్టపోతున్నారు. ఇలాంటి తరుణంలో విద్యార్థులను చదువుపై మళ్లించాలన్న ఉద్దేశంతో పాఠశాలల్లో గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నారు. వీటితో విజ్ఞానం పెరగడంతోపాటు సృజనాత్మకత పెంపొందుతుంది. ఇందులో సాహిత్యం, ఇతిహాసం, కార్టూన్లు, పురాణ కథలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని చదివితే సామాజిక స్పృహ అలవాటపడుతుంది. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్ కూడా కేటాయించారు.

అధికారులు అప్రమత్తం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు రావడంతో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠన సామర్థ్యం పెంచడం, వారి జ్ఞానాన్ని పెంపొందించడం కోసం చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలకు బుక్స్ పంపించడమే కాకుండా వీటి కోసం ఒక ప్రత్యేక పీరియడ్ నిర్వహించనున్నారు. పిల్లలే కాకుండా వారి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే టీచర్స్ భవన్‌లో గ్రంథాలయాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కల్పిస్తున్నారు. హైటెక్ యుగంలో ప్రపంచం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతీ విషయాన్ని నేర్చుకోవాలన్న ఉద్దేశంతో పుస్తక పఠనాన్ని విద్యార్థులకు అలవాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైమరీ, యూపీఎస్ స్కూళ్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు.

566 స్కూళ్లకు బుక్స్ అందజేత

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 566 స్కూళ్లకు ఇప్పటివరకు బుక్స్‌ను అందించారు. మొదటి విడతలో ఒక్కో స్కూల్‌కు 259 పుస్తకాల చొప్పున అందజేశారు. రెండో విడతలో 113 బుక్స్ అందించారు. ఇందులో ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ముద్రించినవి కూడా ఉన్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా కథనాలు ఉన్నాయి. ప్రతీ కథ 11 పేజీల వరకు ఉంది. మంచిమంచి కథలున్నాయి. పాఠశాలలో విద్యాశాఖ గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక చేస్తున్నారు. వీటిపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మార్గదర్శకాలను చేశారు.

సెల్‌ఫోన్ దృష్టి మళ్లించడానికే..

స్కూల్‌కు వెళ్లినప్పటికీ విద్యార్థులు ఇంటికి రాగానే ఈ మధ్య కాలంలో సెల్‌ఫోన్ల మోజులో పడిపోతున్నారు. అందులో ఎక్కువగా గేమ్స్, ఇతరత్రా యాప్‌లు చూస్తు ఉండిపోతున్నారు. కథనాల జోలికి మాత్రం వెళ్లడం లేదు. ఫలితంగా వీరిలో పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోతోంది. ప్రస్తుతం స్కూళ్లలో ఈ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులకు మంచి చదువుతో పాటు ప్రపంచ విషయాలు తెలుసుకునేలా ఉంటుంది. పాఠశాలల్లో మంచి బలోపేతమైన పుస్తకాలు ఏర్పాటు చేస్తే చదువు ఇంకా ముందుకెళ్తుంది. సెల్‌ఫోన్లు తగ్గించాలంటే నాణ్యమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం అయితే చిన్నారుల కోసం అనేక కథనాలతో కూడిన పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు.

శిక్షణ కల్పిస్తున్నాం



పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ప్రతి పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేశాం. పిల్లల వద్దకే పుస్తకాలు తీసుకువచ్చే ప్రణాళిక చేశాం. పుస్తక పఠనం అలవాటు చేయించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇది మంచి కార్యక్రమం.
– రాము, డీఈవో

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మహిళ సంఘాలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల: మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ప్రమాదబీమా, లోన్ బీమా కల్పించామని, ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబసభ్యులకు రూ.10 లక్షల పరిహారం అందుతుందని, సహజ మరణం పొందితే సభ్యురాలి పేరిట ఉన్న రుణం గరిష్టంగా రూ.2 లక్షల వరకు మాఫీ అవుతుందన్నారు. జిల్లాలో 134 మంది మహిళలకు విద్యార్థుల డ్రెస్సులు కుట్టే బాధ్యత అప్పగించి.. వారికి కుటీర వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. మహిళాసంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చామన్నారు. తాటిపల్లి మహిళాసంఘాలకు పైలెట్ ప్రాజెక్ట్ కింద వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించామన్నారు. చల్‌గల్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. వడ్డీమాఫీ కింద 2,670 మంది స్వశక్తి సభ్యులకు రూ.3.11 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. వడ్డీ లేని రుణాలను 123 సంఘాలకు రూ.17 కోట్లు, స్త్రీనిధి ద్వారా పట్టణ పొదుపు సంఘాలకు రూ.17 లక్షలు అందించారు. డీఆర్డీవో రఘువరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

20 వేల మందికి నివాసం

20 వేల మంది నివసించేలా అర్బన్ హౌసింగ్ ఇందిరమ్మ కాలనీ ప్రాజెక్ట్ రూపకల్పన చేశామని ఎమ్మెల్యే అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఇందిరమ్మ కాలనీ వసతులపై సమీక్షించారు. 4,520 ఇళ్లలో నివసించే ప్రజల కోసం వసతులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్డీవో మధుసూదన్, హౌసింగ్ పీడీ ప్రసాద్, కమిషనర్ స్పందన, తహసీల్దార్ రాంమోహన్, సర్వేయర్ విఠల్, డీఈ మిలింద్, ఏఈలు అనిల్, చరణ్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

వెల్గటూర్: యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. వెల్గటూర్ మండలంలో గురువారం పర్యటించిన ఆయన పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో మందుల నిల్వలను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. రోగులకు ఇబ్బంది లేకుండా చికిత్స అందించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, సహకార అధికారి మనోజ్ కుమార్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సాయికిరణ్, సంఘ చైర్మన్ రత్నాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సత్తా చూపాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు

రాయికల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు కార్యకర్తలకు సూచించారు. గురువారం రాయికల్ పట్టణంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపొందేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ కన్వీనర్ శ్రీనివాస్, పార్లమెంట్ కో–కన్వీనర్ సదాశివ్, మండల ఇన్‌చార్జి రాగిల్ల సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి, మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మండల అధ్యక్షుడు మహేశ్, పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంజూరు పత్రం అందిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, బడుగు, బలహీనవర్గాల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన వికలాంగుడు అత్తెన రాజమల్లుకు ఇందిరమ్మ ఇల్లుమంజూరు పత్రాన్ని అందించారు. నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. మండలకేంద్రంలోని శ్మశా న వాటికకు సరైన రహదారి లేక గ్రామస్తులు ఇబ్బ ంది పడుతున్నారు. వారి సమస్యను మంత్రి గురువారం స్వయంగా పరిశీలించారు. శ్మశాన వాటికకు దారికి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.

సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



బీర్‌పూర్‌లో మాట్లాడుతున్న వసంత

సారంగాపూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండల కార్యకర్తలతో స్థానిక ఎన్నికలపై సమాయత్త సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత పెరిగిందన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని, అలాగే బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిచాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నేరెళ్ల సుమన్ గౌడ్, విండో మాజీ చైర్మన్ మెరుగు రాజేశం, నాయకులు రామన్న, జితేందర్, శ్రీనివాస్, రాంచంద్రం, సుధాకర్, లింగన్న, మల్లేశం, రామయ్య, రాజేష్, మాజీ సర్పంచ్ రవీందర్, మల్లేశం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కల్లెడలో..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో కల్లెడ, తక్కళ్లపల్లి, సంగంపల్లి, సోమన్‌పల్లి, గుల్లపేట, అనంతారం, హబ్సీపూర్, పొలాస, గుత్రాజీపల్లి గ్రామాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వసంత మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. కల్లెడ, జగిత్యాల సింగిల్ విండో చైర్మన్లు సందీప్‌రావు, మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనందరావు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జగిత్యాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు ప్రోత్సహించేలా వైద్యులు చూడాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో సూపరింటెండెంట్లతో సమావేశమయ్యారు. సీజేరియన్లలో జిల్లా రాష్ట్రంలో 75.1తో మొదటిస్థానంలో ఉందని, దీనిని తగ్గించి సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి ఆస్పత్రుల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి డెలివరీకి దగ్గరగా ఉన్న వారి జాబితాను సేకరించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్చేలా చూడాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అశోక్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు గ్రామాలకు తరచూ వెళ్లాలని, ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, దర్యాప్తులో అలసత్వం వహించవద్దని సూచించారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పురాతన భవనంలో ఉండడంతో గదులపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉన్న విషయాన్ని ఎస్పీ పరిశీలించారు. నూతన భవనానికి ప్రతిపాదన పంపించామని, నిధులు మంజూరుకాగానే కొత్త భవనం నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'ఇందిరమ్మకు' ఉచిత ఇసుక

- ఒక్కో ఇంటికి 40 టన్నులు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు ప్రక్రియ
- తహసీల్దార్ అనుమతితో ఇసుక సరఫరా
- ఆత్మకూర్ పెద్దవాగు నుంచి తరలించేలా చర్యలు



జగ్గాసాగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు (ఫైల్)

మెట్‌పల్లిరూరల్: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోంది. ఆ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను కూడా ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు కూడా వచ్చాయి. ఇసుక కోసం దరఖాస్తుపత్రాలు ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సిద్ధంగా ఉన్నాయి.

లబ్ధిదారులు ముందుకు రావాలని..

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారిలో చాలామంది ఆర్థిక స్థోమత లేనివారే. దీంతో ఇంటి నిర్మాణానికి ముందుకు రావడంలేదు. మరికొందరు అష్టకష్టాలు పడుతూ ఎలాగోల నిర్మాణం చేపడుతున్నారు. వారి పరిస్థితిని క్షేత్రస్థాయిలో గమనించిన ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందించాలని, ఒక్కో ఇంటికి సుమారు 40 టన్నులు సరఫరా చేయాలని నిర్ణయించింది. మెట్‌పల్లి మండలంలో 564 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో తమకు కొంతమేర ఆర్థిక భారం తగ్గడంతోపాటు ఆదనంగా ప్రయోజనం కలుగుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇసుక కావాల్సిన లబ్ధిదారులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు ఫారంతోపాటు పంచాయతీ పర్మిషన్ జిరాక్స్‌ను కార్యదర్శులకు అందించాలి. వాటిని పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిస్తారు. తహసీల్దార్ పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

ఆత్మకూర్ రీచ్ నుంచి సరఫరా

మెట్‌పల్లి ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఇసుక సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో పెద్దవాగును ప్రభుత్వం రీచ్‌గా గుర్తించింది. ఆ ప్రాంతంలో సుమారు 5,550 టన్నుల ఇసుక తీసుకునే వీలుంది. ఇందులో దాదాపు వెయ్యి టన్నుల ఇసుక సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు తరలించారు. రెండు రోజుల క్రితం మరోమారు పెద్దవాగులో ఇసుక లభ్యతను పరిశీలించిన మైనింగ్ అధికారులు.. దాదాపు 4,550 టన్నుల ఇసుక తీయవచ్చని గుర్తించారు. ఇందుకోసం ఆత్మకూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని సాండ్ రీచ్ ఆఫీసర్ (ఎస్ఆర్‌వో)గా నియమించారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉచిత ఇసుక కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో ఇంటి నిర్మాణానికి 40 టన్నులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో, మెట్‌పల్లి

ఆదేశాలు ఉన్నాయి

లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని రెవెన్యూ కార్యాలయంలో అందించాక పరిశీలించి అనుమతులు జారీ చేస్తాం.
– నీత, తహసీల్దార్, మెట్‌పల్లి



ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణం



దుబ్బరాజన్న ఆలయం

ఆలయాలకు శ్రావణ శోభ

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ముస్తాబైన ధర్మపురి నృసింహాలయం
- దుబ్బరాజన్న ఆలయంలో ఏర్పాట్లు పూర్తి

ధర్మపురి/సారంగాపూర్: అన్ని మాసాల్లోకెల్ల శ్రావణ మాసానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. శ్రావణంలో నెలపాటు ఉపవాస దీక్షలు చేస్తారు. ఆలయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగిపోతాయి. ధర్మపురిలోని శ్రీయోగాలక్ష్మీనృసింహస్వామి, ఉగ్ర శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 23వరకు ఆలయాల్లో అభిషేకాలు, భాగాలు, సంకల్పాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు రాత్రి 10 గంటల నుంచి భజన కార్యక్రమాలు ఉంటాయని దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ప్రతి సోమ, శుక్ర, శనివారం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. పారిశుద్ధ్య నిర్వహణ, క్యూలైన్లు, తాగునీటి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య పేర్కొన్నారు.

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన సాగర్ మృతదేహం



సాగర్ శవపేటిక వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు



సాగర్(ఫైల్)

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన బత్తుల సాగర్(42) ఈ నెల 22న కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మృతదేహం స్వగ్రామం చేరింది. ఉపాధి కోసం సాగర్ మూడేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. కుటుంబ సభ్యుల రోధనల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



రమేశ్ మృతదేహం

గొల్లపల్లి: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్మాలాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండికోట రమేశ్ (37) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన సంపాదనతో భార్య మంజుల, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. ఈ క్రమంలో అప్పు చేశాడు. పిల్లల్లో ఒకరు అనారోగ్యం బారిన పడ్డారు. వైద్య ఖర్చులకు మరింత అప్పు చేశాడు. వాటిని తీర్చేదారి లేక జీవితంపై విరక్తి చెంది సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు వచ్చేసరికే చనిపోయాడు. ఇంటి పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. రమేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

వస్తువుల బహిరంగ వేలం

కరీంనగర్: నగరంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ దివ్యాంగుల, వయో వృద్ధుల వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నీచర్, బీరువాలు, చెక్క కప్‌బోర్డ్స్, ఫిజియోథెరపి చైర్ తదితర వస్తువులను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వస్తువులను ప్రభుత్వ దివ్యాంగుల, వయో వృద్ధుల వసతి గృహంలో ఈనెల 28వ తేదీ వరకు పరిశీలించుకుని వేలంలో పాల్గొనవచ్చునని అన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని దినములలో 8096338488, 9492930728 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

సాఫల్యం.. వైఫల్యం!

- జిల్లాలో 20 శాతం మంది బాధితులు
- జీవనశైలి మార్పులే కారణం
- పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే



కరీంనగర్‌టౌన్: వివాహమైన ప్రతీ స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది. అయితే ఆ యోగ్యత కొందరికి మాత్రం లభించడం లేదు. ఇందుకు ఆమెలో కొన్ని అనారోగ్య కారణాలు, లేదా భర్తలో ఏదైనా లోపమైనా ఉండొచ్చు. వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటిస్తూ మహిళలు గర్భం దాలుస్తున్నారు. అమ్మ కల నెరవేర్చుకుంటున్నారు. ఐవీఎఫ్ విధానం ద్వారా చికిత్స తీసుకుంటున్నారు. నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

పెరుగుతున్న సంతానలేమి సమస్య

ఇటీవల ఉమ్మడి జిల్లాలో సంతానలేమి సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు వందలో ఒకరిద్దరు మాత్రమే సంతానలేమితో బాధపడేవారు. ఇప్పుడు ఆసంఖ్య 20శాతం వరకు ఉంటోంది. ఇలాంటి వారు వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుని గర్భం దాలుస్తున్నారు. కొందరు మాత్రం మూఢ నమ్మకాలతో కాలం వెళ్లదీస్తున్నారు. కాలానుగుణంగా ఇప్పుడు వైద్యంపై అవగాహన పెరిగింది. గతంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి సంతాన సాఫల్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించేవారు. ఇప్పుడు కరీంనగర్‌లో కూడా అలాంటి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో మహానగరాల్లో అందించే వైద్యసేవలు ఇక్కడ అందిస్తున్నారు. కరీంనగర్‌లో పదికి పైగా ఫెర్టిలిటీ కేంద్రాలు (సంతాన సాఫల్య కేంద్రాలు) ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం రోజూ 30 నుంచి 40 మందిదాకా చికిత్స కోసం వస్తుంటారు.

సంతానలేమికి కారణాలివే..

ఇటీవల యువతీ యువకులు జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకుంటున్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాలతో ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దీంతో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయి. మారిన జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, మహిళల్లో పీసీఓడీ (అండాశయంలో తిత్తులు), రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం తదితర కారణాలతో సంతానలేమి సమస్య కలుగుతుంది.

ఐవీఎఫ్ అంటే..

చాలామంది సంతానం లేనివారు సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్తున్నారు. కానీ అక్కడ ఐవీఎఫ్ పద్ధతి గురించి వారికి అవగాహన ఉండదు. ఈ పద్ధతిలో బిడ్డను జన్మనివ్వాలి అనుకునే దంపతులు ముందుగా దాని గురించి అవగాహన ఉండాలి. అప్పుడే భవిష్యత్‌లో వారి మధ్య అపోహలు తలెత్తకుండా ఉంటాయి. సాధారణంగా స్త్రీ గర్భధారణ కలగాలంటే మగవారి వీర్యకణాలు ఆడవారి అండంతో కలవాలి. అది పిండంగా రూపాంతరం చెందుతుంది. ఈ విషయంలో ఇబ్బంది ఉన్నప్పుడు ఐవీఎఫ్ విధానంలో ల్యాబ్‌లో అండకణాలను సంగ్రహించడం చేసి స్పెర్మ్ నమూనాను మెరుగుపరుస్తారు.

ఐవీఎఫ్ ఎప్పుడు అవసరమంటే..

సాధారణంగా సంతానం లేనివారికి ఐవీఎఫ్ అవసరం లేదు. ముందుగా వైద్యులను సంప్రదించి సమస్యను వివరించాలి. దీన్ని బట్టి ముందుగా సహజసిద్ధంగా గర్భం దాల్చేలా తగిన చికిత్స, ఔషధాలు అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలిగేందుకు అవకాశం లేకుండా ఉన్నవారికి మాత్రమే ఐవీఎఫ్ చికిత్స ప్రారంభిస్తారు. ముఖ్యంగా ఆడవారిలో ఫెలోపియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు, అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు, అండాశయ ట్యూబ్స్ బ్లాక్ అయినప్పుడు, ఎక్కువ సార్లు అబార్షన్లు అయినవారికి, క్యాన్సర్ రోగులు, మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా, పూర్తిగా లేనప్పుడు ఐవీఎఫ్ చికిత్స అవసరం ఉంటుంది.

అపోహలు వద్దు



1978 జులై 25న ఇంగ్లండ్‌లో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) అనే కృత్రిమ గర్భధారణ పద్ధతిలో జన్మించిన మొదటి బిడ్డ లూయిస్ బ్రౌన్ అయ్యారు. ఈ విజయానికి గుర్తుగా ఏటా జులై 25న ప్రపంచ ఎంబ్రియాలజిస్ట్ డేగా జరుపుతారు. ఇప్పటికీ చాలామందికి ఐవీఎఫ్ అంటే తెలియని భయం . సంతానం కలిగేందుకు అన్ని ప్రయత్నాలు చేసి విఫలమైనప్పుడు మాత్రమే ఐవీఎఫ్ మార్గాన్ని సూచిస్తాం.

– డాక్టర్ రేఖారాణి, రేఖాసాగర్ ఐవీఎఫ్ సెంటర్

సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు



30 ఏళ్లు దాటిన మహిళలకు సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం ద్వారా ఇప్పటివరకు 8 మిలియన్ల మందికి పైగా జన్మించారు. అయితే ఐవీఎఫ్‌పై చాలామందికి అపోహలున్నాయి. ఐవీఎఫ్‌లోనూ ఐసీఎస్ఐ, ఐవీఎం, ఎగ్‌ఫ్రీజింగ్, స్పెర్మ్ ఫ్రీజింగ్, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్, ప్రీ ఇంప్లాంటేషన్, జనటిక్ టెస్ట్ అనే అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాయి. ఐవీఎఫ్‌లో ఇచ్చే మందులతోనూ ఎలాంటి సైడ్ఎఫెక్ట్స్ ఉండవు.

– డాక్టర్ రజని ప్రియదర్శిని, రజని ఫెర్టిలిటీ సెంటర్

ప్రభుత్వ ఆస్పత్రిలో కత్తిపోట్ల కలకలం



పాలకుర్తి మహేశ్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో గురువారం కత్తిపోట్ల కలకలం రేపింది. స్థానికులు కథనం.. చొప్పదండి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రావణిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన పాలకుర్తి మహేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు.కాగా... శ్రావణి ఇటీవలే గర్భం దాల్చగా చికిత్స నిమిత్తం భర్త పాలకుర్తి మహేశ్ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆమెకు రక్తస్రావం కావడం.. కడుపులో పిండం సరిగా లేకపోవడంతో వైద్యులు అబార్షన్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రావణి అన్న అదే ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహేశ్ బావ పాలకుర్తి మహేశ్‌పై కత్తితో దాడిచేశాడు. దీంతో ఆయనకు పలుచోట్ల గాయాలయ్యాయి. హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వండంతో టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. గాయపడ్డ పాలకుర్తి మహేశ్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, సంఘాల నాయకులు

మంథని: మంథనిలో ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహ విద్యార్థులు గురువారం రోడ్డెక్కారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మెనూ ప్రకారం వార్డెన్ సరుకులు ఇవ్వడం లేదని, సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని వాపోయా రు. వారానికి ఒకసారి మాత్రమే వసతి గృహానికి వచ్చి సరుకులు ఇచ్చి వెళ్తున్నారని, అవి సరిపోవడం లేదని పేర్కొన్నారు. టిఫిన్ ఆలస్యమవుతుందని, తమ ఆలస్యంపై ప్రిన్సిపాల్ పలుమా ర్లు హెచ్చరించారని ఆవేదన వెలిబుచ్చా రు. విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు మద్దతుగా రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు సంఘాల జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, గొర్రంకల సురేశ్ మాట్లాడుతూ, విద్యార్థులకు సమయానికి సరుకులు ఇవ్వకుండా, రోజువారీ మెనూ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్ రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వసతి గృహాల సంరక్షకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు, నాయకులకు పోలీసులు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

రామానుజమ్మకు జాతీయ పురస్కారం



నటుడు భానుచందర్ నుంచి జాతీయ ప్రతిభ పురస్కారం అందుకుంటున్న రామానుజమ్మ

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మకు మరో ప్రతిభ పురస్కారం వరించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వైఎంకే అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ ఎక్సలెంట్ అవార్డులను ప్రదానం చేశారు. సిరిసిల్లకు చెందిన వెటరన్ అథ్లెట్, మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ టమటం రామానుజమ్మను ఎంపిక చేశారు. వైఎంకే అధ్యక్షుడు, సినీ నటుడు భానుచందర్ అవార్డును అందజేశారు. ఏడుపదుల వయసులో జాతీయ స్థాయి పురస్కారం అందుకున్న రామానుజమ్మను పలువురు అభినందించారు.

మారుతి రైస్‌మిల్ అనుమతులు రద్దు

- కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్పు
- ఆదేశాలు జారీ చేసిన అధికారులు



రైస్‌మిల్‌పై విచారణ చేపడుతున్న అధికారులు (ఫైల్)

వేములవాడరూరల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మిల్లు నిర్మించిన వ్యవహారంపై పలువురి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు సదరు మిల్లు అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి శివారులో సర్వేనంబర్ 750లోని మల్లయ్యకుంటలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రైస్‌మిల్లును కొందరు వ్యాపారులు నిర్మించిన విషయంపై గతంలో మల్లారం మాజీ ఎంపీటీసీ సంగెం వీరారెడ్డితోపాటు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు ఆ మిల్లును కమర్షియల్ నుంచి అగ్రికల్చర్‌కు మార్పు చేసినట్లు వెల్లడించారు. సర్వేనంబర్ 750లో 18 ఎకరాల 18 గుంటల స్థలంలో దాదాపు 5 ఎకరాలకు మాత్రమే మిల్ యజమానులు నాలా కన్వర్షన్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. మిల్లు అనుమతులను, నాలా కన్వర్షన్‌ను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వరుస కథనాలతో కదలిన యంత్రాంగం

మర్రిపల్లి శివారులో నిర్మించిన మారుతి రైస్‌మిల్లు నుంచి వస్తున్న వ్యర్థాలు, కలుషితంతో ఆ ప్రాంత రైతులకు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ×సాక్షి<లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై స్పందించిన అధికారులు గతంలో పలుమార్లు విచారణ చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో మిల్లు నిర్మించినట్లు గుర్తించారు. ఎట్టకేలకు ఆ మిల్లు అనుమతులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



మర్రిపల్లి శివారులో మారుతి రైస్‌మిల్లును నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించారు. ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్పందించి అనుమతులు రద్దు చేయించారు. రైతులు, గ్రామస్తుల తరఫున కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

– సంగెం వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ, మల్లారం

ఉత్తర్వులు వచ్చాయి



మర్రిపల్లి శివారులో నిర్మించిన మారుతి రైస్‌మిల్లు అనుమతులు రద్దు చేసినట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించినట్లు ఫిర్యాదులు రావడంతో ఉత్తర్వులు వచ్చాయి.

– అబూబాకర్, తహసీల్దార్, వేములవాడరూరల్

వేధిస్తున్నాడని భార్యనే హతమార్చింది !

- గంజాయి కేసు విచారణతో హత్య కేసు వెలుగులోకి..
- మద్యానికి బానిసై వేధిస్తున్నాడని ఐదుగురితో కలిసి అఘాయిత్యం
- రెండేళ్ల క్రితం కొండగట్టులో దారుణం
- హత్యోదంతం అంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరణ
- గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసుగా నమోదు
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల: రెండేళ్ల క్రితం.. మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. గుర్తు తెలియని వ్యక్తిని మెట్‌పల్లికి చెందిన సింగం నడిపి గంగాధర్(40)గా గుర్తించారు. మద్యానికి బానిసై నిత్యం వేధిస్తున్నాడని ఆయన భార్యే మరో నలుగురితో కలిసి హత్య చేసినట్లు నిర్ధారించారు. హత్యోదంతాన్ని నిందితులు వీడియో చిత్రీకరించారు. గంజాయి కేసులో పట్టుబడిన నిందితులను విచారించగా ఈ విషయాలన్నీ వెలుగు చూశాయి. రెండేళ్ల క్రితం జరిగిన ఈ సంఘటన సంబంధించిన వివరాలను డీఎస్పీ రఘుచందర్ స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం వెల్లడించారు. ముత్యంపేట శివారులో 2023 మార్చి 14న గుర్తు తెలియని వ్యక్తి కాలిపోయి ఉన్నాడని అప్పటి వీఆర్ఏ అజీమొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈనెల 17న మెట్‌పల్లికి చెందిన సింగం గ్రాహిత్, అబ్దుల్ అప్సర్, చెన్న నిఖిల్‌ను మెట్‌పల్లి పోలీసులు గంజాయి కేసులో అరెస్టు చేశారు. వారి వద్దనున్న సెల్‌ఫోన్‌లు పరిశీలించగా.. హత్యకు సంబంధించిన వీడియో కనిపించింది. దీనిపై వారిని విచారించారు. మెట్‌పల్లికి చెందిన సింగం నడిపి గంగాధర్ మద్యానికి బానిసై నిత్యం భార్య సంధ్య, కుటుంబసభ్యులను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఇంట్లో వస్తువులు అమ్ముకుని జూదం ఆడేవాడు. నిత్యం మద్యం సేవించి వచ్చి హింసించేవాడు. పెద్ద కూతురు వివాహం చేసేందుకూ అడ్డుపడడంతో రూ.10వేలు ఇచ్చి ఒప్పించి.. బిడ్డ వివాహం చేశారు. కూతురి అత్తవారింటికి వెళ్లి అల్లుడితోనూ గొడవ పడేవాడు. ఈ విషయాన్ని సంధ్య గంగాధర్ అన్న కొడుకు గ్రాహిత్, తోటికోడలు మమతకు చెప్పింది. వారు గొడవ చేయవద్దని చెప్పినా గంగాధర్ వినిపించుకోలేదు. అతడిని చంపితేనే తాము సంతోషంగా ఉంటామని నిర్ణయించుకున్న సంధ్య.. గ్రాహిత్‌కు విషయం చెప్పింది. రూ.40వేలు ఇస్తే మరో ముగ్గురిని తీసుకొస్తానని అతడు చెప్పగా ఆ మొత్తం అందించింది. గ్రాహిత్ తన స్నేహితులైన అబ్దుల్ అప్సర్, పవన్ కలిసి గంగాధర్‌ను చంపేందుకు ఒప్పుకున్నారు. 2023 మార్చి 12న కారును అద్దెకు తీసుకుని సంధ్య, గ్రాహిత్, అబ్దుల్ అప్సర్, చెన్న నిఖిల్, పవన్, సింగం మమత కొండగట్టుకు వెళ్దామని చెప్పి గంగాధర్‌ను ఎక్కించుకుని ముత్యంపేట శివారు డంపింగ్‌యార్డు సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ గంగాధర్‌కు మద్యం తాగించారు. సంధ్య, మమత గంగాధర్ కాళ్లు పట్టుకోగా.. గ్రాహిత్, అప్సర్ వైర్‌ను మెడకు చుట్టి ఊపిరాడకుండా చేశారు. నిఖిల్ ఎవరైనా వస్తున్నారా అని గమనిస్తూ ఉన్నాడు. గంగాధర్ చనిపోయాడని నిర్ధారించుకుని శవాన్ని ఎవరూ గుర్తించకుండా చెత్తలో వేసి నిప్పంటించారు. ఈ హత్యోదంతాన్ని మొత్తం వీడియోతీశారు. అనంతరం మెట్‌పల్లి వెళ్లిపోయారు. మార్చి 14న గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గమనించి వీఆర్ఏ అజీమొద్దీన్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. గంజాయి కేసు విచారణలో సెల్‌ఫోన్‌లో హత్యకు సంబంధించిన వీడియో ఉండడంతో ఘటనలో ఆరుగురు పాల్గొన్నారని పోలీసులు నిర్ధారించుకున్నారు. వీరిలో గ్రాహిత్, అబ్దుల్ అప్సర్, నిఖిల్ ఇప్పటికే గంజాయి కేసులో అరెస్టయి ఉన్నారు. పవన్ మరో కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. మమత మృతి చెందింది. ఏ–1 నిందితురాలైన సింగం సంధ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగిలిన వారిని కోర్టు అనుమతితో విచారించి, అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ నీలం, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

జూలపల్లి(పెద్దపల్లి): భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకట్రావుపల్లెకు చెందిన జుట్టు అంజయ్య(35) వికలాంగుడు. పదేళ్ల క్రితం దూళికట్టకు చెందిన జ్యోతితో పెండ్లి కాగా ముగ్గురు సంతానం. మూడునెలలుగా భార్య కాపురానికి రావడం లేదు. ఎంతగా ప్రయత్నం చేసినా భార్య రాక పోవడంతో అంజయ్య మానసికంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో రెండురోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి దొరకలేదు. గురువారం ఉదయం గ్రామంలోని ప్రభుత్వ తాగునీటి బావిలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి జుట్టు చిన్నవెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

డెయిరీల్లో యూరియా అక్రమ నిల్వలు

- ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా సరఫరా
- తనిఖీలు నామమాత్రమే.?

కరీంనగర్ అర్బన్: సాగుకు చేరాల్సిన రాయితీ యూరియా పక్కదారి పడుతోంది. అక్రమార్కుల వికృత చేష్టలతో సాగు రంగానికి సవాల్‌గా మారగా నియంత్రించాల్సిన యంత్రాంగం మొద్దునిద్రలో జోగుతోంది. అన్నదాత సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వేలల్లో భరిస్తూ రైతులకు తక్కువ ధరకు యూరియా సరఫరా చేస్తుండగా క్షేత్రస్థాయిలో మాత్రం కేంద్ర లక్ష్యం నీరుగారిపోతోంది. ఓ అధికారి, ఓ హోల్‌సేల్ డీలర్, పలువురు ఫర్టిలైజర్ దుకాణదారుల తీరుతో అభాసుపాలవుతోంది. బహిరంగంగా యూరియా నిల్వలు కనబడుతున్నా అధికారుల కళ్లకు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు, ఎప్పుడు కొనుగోలు చేశారు, అసలు సదరు యూరియా ఉత్పత్తి అయి ఎన్ని రోజులవుతోంది, తాజాగా వచ్చిందా.. గతంలోదా..అన్నది తేల్చేందుకు అన్ని అవకాశాలున్నా తదనుగుణ చర్యలు లేవన్న ఆరోపణలున్నాయి.

డెయిరీలు, దాణా తయారీ కేంద్రాల్లో భారీ నిల్వలు

పాల డెయిరీలు, పశువుల దాణా, కోళ్ల దాణా తయారీ చేసే కేంద్రాల్లో పెద్దమొత్తంలో యూరియా నిలవ్వలున్నట్లు విశ్వసనీయ సమాచారం. చోట డెయిరీల నుంచి బడా డెయిరీల వరకు అక్రమార్గంలో యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. పాల ఉత్పత్తిలో ఇది కీలకం కాగా నేరుగా కంపనీల నుంచి కొనాల్సిందిపోయి రైతుల పేరిట భారీ మొత్తంలో నిల్వ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు పాల డెయిరీలుండగా పశువుల దాణా, కోళ్ల దాణా తయారు చేసే కుటీర నుంచి భారీ పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే యంత్రాంగం కరవవడంతో వీరి దందా నిరాటంకంగా సాగుతోంది. సీజన్ వచ్చిందంటే చాలు ముందస్తు ప్రణాళికలతో సఫలీకృతులవుతున్నారు. ఏళ్లుగా ఈ దందా సాగుతుండగా పలువురు అధికారులకు ముడుపులు ముడుతున్నాయన్నది ఇంట, బయట వినిపిస్తున్న మాట.